క్లుప్తంగా

నిధులు మంజూరుపై హర్షం

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల మట్టిరోడ్లను బీటీరోడ్లుగా మార్చేందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిధులు మంజూరు చేయడం పట్ల గ్రామాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. బుధవారం చిగురుమామిడిలో మాట్లాడారు. బీటీ రోడ్లుగా మార్చేందుకు మంత్రి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ నియోజకవర్గ అభివృద్ధిని మరవడంలేదని, వారానికి రెండు సార్లు పర్యటిస్తూ ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నాడని పేర్కొన్నారు.

సీపీఎం మండల మహాసభ



జెండా ఎగురవేస్తున్న సీపీఎం నాయకులు

ఇల్లందకుంట: ప్రజాసమస్యల పరిష్కారానికి ఎర్రజెండా బాట పట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ మండలశాఖ మహాసభను మల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాలకవర్గ పార్టీలు సమస్యలవైపు కనీసం కన్నెత్తి చూడడంలేదన్నారు. సీపీఎం ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందునిలబడుతుందన్నారు. అనంతరం నూతన మండలశాఖ కార్యదర్శిగా తిప్పరబోయిన శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు రాములు, మల్లయ్య, స్వామి, వెంకన్న, రవి, ఎల్లయ్య పాల్గొన్నారు.

సామాజిక సేవ అభినందనీయం



చీరలు పంపిణీ చేస్తున్న కమిషనర్ అయాజ్, కౌన్సిలర్ విజయ మల్లయ్య

జమ్మికుంట: జన్మదిన వేడుకల సందర్భంగా వృథా ఖర్చు చేయకుండా సామాజిక సేవ చేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధి మోత్కులగూడెం గ్రామం పదో వార్డులో పొనగంటి మల్లయ్య జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. పట్టణంలోని శివాలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పొనగంటి విజయ మల్లయ్య, మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, టీపీవో శ్రీధర్, సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై అనూష

చొప్పదండి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం డ్రగ్స్ అనర్థాలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్సై అనూష ముఖ్య అతిథిగా హాజరై సైబర్ నేరగాళ్లు కొత్త విధానాల్లో చేస్తున్న మోసాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శరత్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

చొప్పదండి: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. శ్రీరాములు పేరును సురవరం ప్రతాపరెడ్డిగా మారుస్తు తీర్మానం చేయడాన్ని ఖండిస్తున్నామని, ఆంధ్రరాష్ట్ర అవతరణకు అమరుడైనవారిని అవమానించడం తగదని, ప్రతాపరెడ్డి పేరును ఇతర కొత్త ప్రాజెక్టుకు పెట్టి గౌరవించాలని సూచించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

చొప్పదండి: పోగొట్టుకున్న సెలఫోన్‌ను పదిరోజుల్లోనే పోలీసులు రికవరీ చేశారు. చొప్పదండికి చెందిన కృష్ణయ్య ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిష్టర్ చేసి రికవరీ చేశామని ఈ మేరకు బుధవారం బాధితుడికి ఫోన్ అందజేశామని ఎస్సై అనూష తెలిపారు.

ఆరోగ్య బీమా.. వృద్ధులకు ధీమా

హుజూరాబాద్‌రూరల్: ప్రజా సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. పేద కుటుంబాలకు చెందినవారికి ఉచిత వైద్యం అందించేందుకు బీమా పథకాలు అమలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రూ.ఐదులక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.పది లక్షల వరకు ఖర్చు చేస్తున్నాయి. తాజాగా కేంద్ర మంత్రివర్గం 70 ఏళ్ల పైబడిన వారి వైద్యానికి ప్రత్యేక బీమా కల్పిస్తామని నిర్ణయించింది.

ఖరారు కావాల్సిన విధానాలు

అయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన ద్వారా రూ.ఐదులక్షల బీమా అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ బీమా విధానాలు అమలు చేస్తారా, కొత్త అంశాలు చేకూర్చుతారా అనేది తేలియాల్సి ఉంది. ప్రైవేటు ఆరోగ్య బీమా, ఈఎస్ఐ వంటివి ఉన్నా కేంద్ర ప్రభుత్వం కొత్త బీమా కూడా వర్తింపజేయనుంది. 70 ఏళ్ల పైబడిన వారిలో రక్తపోటు, మధుమేహం, మోకాళ్ల నొప్పులు, వంటి వాటితో బాధపడే వారే ఎక్కువగా ఉంటారు. పక్షపాతం, గుండెజబ్బులు, మూత్రపిండాల



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

వ్యాధులు కంటిచూపు లోపించడం తదితర సమస్యలుంటాయి. హుజూరాబాద్ మండలంలో 70 ఏళ్ల పైబడిన వారు సుమారు 2,512 మంది ఉన్నారు. ఈనిర్ణయం పట్లవారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒక కుటుంబంలో ఇద్దరు వృద్ధులున్నా బీమా వర్తించనుంది.

మంచి నిర్ణయం



మా లాంటి వృద్ధులకు ఏదో ఒక అనారోగ్య సమస్య ఇబ్బంది పెడుతుంటుంది. ఆసుపత్రుల చుట్టూ తిరగడం సాధారణమే. మాకు కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా పథకం తీసుకురావడంతో మాకు ధీమా కలగనుంది. పేద, ధనిక తేడా లేకుండా అందించడం అభినందనీయం.

– మైస బాలమ్మ, వృద్ధురాలు, కాట్రపల్లి

త్వరగా అమలు చేయాలి



కేంద్ర ప్రభుత్వం వృద్ధుల ఆరోగ్యం గూర్చి ఆలోచన చేయడం సంతోషదాయకం. ప్రత్యేక బీమాతో మాలాంటి వారికి భరోసా కలుగుతుంది. ఇప్పటికే చాలా మంది అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. పథకాన్ని లబ్ధిదారులకు అందించడానికి తొందరగా విధివిధానాలు రూపొందించాలి.

– చిదిరాల బక్కారెడ్డి, వృద్ధుడు, ధర్మరాజుపల్లి

విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: విద్యార్థులు పట్టుదలతో చదువుతూ ఉన్నత స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండలంలోని గర్శకుర్తి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం షూ అందజేశారు. ఎమ్మెల్యేకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తున్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని విద్యార్థులుకు సొంత ఖర్చులతో ఉదయం అల్పాహారం అందజేయడంతో పాటు సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందిస్తానని, గర్శకుర్తి పాఠశాల నుంచే ప్రారంభిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, తహసీల్దార్ అనుపమరావు, ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



షూ అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రోడ్డు పనులు ప్రారంభం

రూ.రెండు కోట్ల యాభై లక్షల పంచాయతీరాజ్ సీఆర్ఆర్ నిధులతో నిర్మించనున్న కాసారం–గంగాధర రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గత ప్రభుత్వం గ్రామాల మధ్య అంతర్గత రోడ్లు వేయడంలో విఫలమైందన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే సత్యం మధురానగర్‌లోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

సమాచారం

దరఖాస్తులు ఆహ్వానం

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని టేకుర్తి మోడల్ స్కూల్, కళాశాలలో గంటల ప్రాతిపదికన తెలుగు, హిందీ బోధించుటకు ఆసక్తిగల అభ్యర్థులు 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.ఐలయ్య తెలిపారు. పీజీటీ(తెలుగు) బోధించడానికి ఎంఏ తెలుగు, బీఈడీ, టీజీటీ(హిందీ)బోధించడానికి హెచ్‌పీటీ పూర్తి చేసినవారు, టెట్ ఉత్తీర్ణులైనవారు అర్హులని పేర్కొన్నారు.

నియామకం

గన్నేరువరం: తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్ల ఫోరమ్ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన లింగంపెల్లి రమేశ్ నియామకమయ్యారు. ఈమేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాసం రత్నాకర్ బుధవారం కరీంనగర్‌లో నియామకపత్రం అందజేశారు. నియామకానికి సహకరించిన రత్నాకర్, జనరల్ సెక్రెటరీ ఊట్కూరి రామచంద్రారెడ్డికి రమేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

సంక్షిప్త వార్తలు

✦ బెల్ట్‌లు, ఐడీకార్డులు పంపిణీ

చిగురుమామిడి: మండలంలోని రేకొండ జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మిలీనియం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఐడీ కార్డు, బెల్టు, టైలు బహూకరించారు. బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గోదరి అజయ్ 107 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు.

✦ జీవో నంబర్ 25 సవరించాలి

ఇల్లందకుంట: మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి జగన్‌మోహన్ మాట్లాడుతూ.. జీవో నెంబర్ 25 సవరించాలని డిమాండ్ చేశారు.

✦ పోస్టర్ ఆవిష్కరణ

ఇల్లందకుంట: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో 27న సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి ప్రాంతం నుంచి పెద్దఎత్తున తరలిరావాలని కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ఎక్కటి సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

✦ పీడీఎస్‌యూ పోస్టర్..

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ద ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ అలుపెరగని ఉద్యమం చేస్తుందన్నారు.

✦ పదోన్నతి కల్పించాలి

గంగాధర: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐదు వేల ఎల్ఎఫ్ఎల్ హెచ్ పోస్టులకు మరో ఐదువేలు కలిపి మొత్తం పదివేల పోస్టులు మంజూరు చేసి ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి తూముల తిరుపతి అన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

✦ ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు

శంకరపట్నం: మండలంలోని ధర్మారం గ్రామ శివారులో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగుపడటంతో పేలిపోయింది. రైతులు బుధవారం ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే మరమ్మతు చేయిస్తామని ట్రాన్స్‌కో సిబ్బంది తెలిపారు.

✦ సౌండ్ బాక్సులు అందజేత

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామం దళిత మహిళలకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఆదేశాల మేరకు బుధవారం సౌండ్ బాక్సులు అందించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆడపు నర్సయ్య, మన్నెంపెల్లి బీజేపీ నాయకుల చొరవతో అందజేశారని, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

✦ ప్రభుత్వ వైద్యశిబిరం

జమ్మికుంట: వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో మండలంలోని వెంకటేశ్వరపల్లి, సైదాబాద్ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణకు ల్యాబ్‌కు పంపించారు. స్వచ్ఛతాహీ సేవ, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు.

✦ ఏకశిలలో సీడ్‌బాల్స్ తయారీ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారు ఏకశిల సీబీఎస్ఈ పాఠశాలలో వాసవి వనిత క్వీన్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సీడ్‌బాల్స్ తయారీ కార్యక్రమం నిర్వహించారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మొక్కలను రక్షించడం విద్యార్థులందరి బాధ్యత అని అన్నారు.

✦ తహసీల్దార్ బదిలీ

వీణవంక: వీణవంక తహసీల్దార్ లక్ష్మణ్‌ను బదిలీ చేస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ నిజామొద్దీన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

✦ ఎంఈవోగా శోభారాణి

వీణవంక: మండల విద్యాధికారిగా మామిడాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం శోభారాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. రానున్న పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేసేందుకు ఉపాధ్యాయులు పాటు పడాలని కోరారు.

✦ మెస్ చార్జీలు పెంచాలి

చొప్పదండి: సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ కోరారు. బుధవారం మాట్లాడుతూ.. హాస్టళ్లు సమస్యలకు నిలయంగా మారాయని మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని కోరారు.

✦ సన్నాహక సమావేశం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో బుధవారం ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం సన్నాహక సమావేశం నిర్వహించారు. దళితులపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై పోరాటం చేసేందుకు సంఘం స్థాపించినట్లు జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల మహేందర్ తెలిపారు.

✦ విద్యార్థులకు షూ పంపిణీ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు తహసీల్దార్ భాస్కర్ బుధవారం షూ పంపిణీ చేశారు. తహసీల్దార్ ఆఫీసులో ఓటరు జాబితాపై రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.

✦ బీమాతో కార్మికులకు లబ్ధి

వీణవంక: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం చేనేత బీమాను ప్రవేశపెట్టిందని, పథకం ద్వారా కార్మికులు అనివార్య కారణాల వల్ల మృతి చెందితే మృతుల కుటుంబాలకు రూ.ఐదులక్షల బీమా వర్తిస్తుందని చేనేత సంఘం జిల్లా సహాయకుడు విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని కోర్కల్ గ్రామంలో చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘంలో 52వ వార్షిక 60వ మహాసభ ఆప్కో మాజీ డైరెక్టర్ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు.

✦ పండుగ వేళ రైళ్లు రద్దు సరికాదు

వీణవంక: దసరా పండుగ వేళ పలురైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించడం సరికాదని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు ఎండీ సాహెబ్‌హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు.

✦ భోజన సౌకర్యం కల్పించాలి


హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సొంతఖర్చులతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ బుధవారం ప్రకటనలో కోరారు. గతంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ మధ్యాహ్న భోజనం అమలు చేశారని గుర్తు చేశారు.

✦ వర్షానికి నేలవాలిన పంటలు

శంకరపట్నం: భారీ వర్షానికి నేలవాలిన వరిపంటను బుధవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మండలంలోని ముత్తారం, కన్నాపూర్, మొలంగూర్ గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించామని,ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఏవో వెంకటేశ్ తెలిపారు.


సేంద్రియ, జీవన ఎరువులు వినియోగించాలి

రామడుగు: పంట సాసగులో రైతులు సేంద్రీయ, జీవన ఎరువులు వినియోగించాలని వినూత్న ఆగ్రోటెక్ ఎల్ఎల్‌పీ మార్కెట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోరండ్ల శివసాయి అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. పంట సాగులో రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యంమవుతాయని, క్రమంగా భూసారం నశించి పంట దిగుబడి తగ్గుతుందన్నారు. సేంద్రీయ, జీవన ఎరువులు వాడడం వల్ల పెట్టుబడి తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. వినూత్న ఆగ్రోటెక్ ఎల్ఎల్‌పీ రైతులకు అందించే ఎరువులు, ఉత్పత్తులు, ఇతర అంశాలను గూర్చి కరీంనగర్ వీఏఎల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ సురేశ్ వివరించారు. కార్యక్రమంలో డీలర్ మారుకొండ రవికిరణ్, రైతులు, ఎండిఓ శివ, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆగ్రోటెక్ ప్రతినిధులు

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



రామడుగు: మండల కేంద్రానికి చెందిన బొమ్మరవేణి తిరుమలతిరుపతిముదిరాజ్‌ను గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించడాన్ని హర్షిస్తూ బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల కేంద్రంతో పాటు గోపాల్‌రావుపేట, గుండి, దేశరాజు పల్లి, తిరుమలాపూర్, వన్నారం, కోరటపల్లి, దత్తోజీపేట గ్రామాల్లోని ముదిరాజ్‌లు వేడుకల్లో పాల్గొని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్ చిన్నపాటి వర్షానికి చెరువును తలపిస్తోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బురదనీటిలో బస్సులు నిలపడంతో బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు బురదలో అడుగు వేయాల్సి వస్తోందని, కొంతమంది ప్రమాదాల బారిన పడుతున్నారని ఇకనైనా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీంద్రనాథ్, డిపో మేనేజర్, సెల్ నం :99592 25924

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

హామీలు నెరవేర్చకపోతే బొందపెడతాం

- మాయమాటలతో కాంగ్రెస్ అధికారంలోకి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

వీణవంక: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దసరాలోపు నెరవేర్చకపోతే సీఎం రేవంత్‌రెడ్డి భరతం పడతామని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. ఆరు గ్యారంటీలను గాలికొదిలేశారని విమర్శించారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం దేశాయిపల్లి గ్రామంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వందశాతం రుణమాఫీ ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. దసరాలోపు పూర్తిస్థాయిలో అమలు చేయాలని హెచ్చరించారు. దళితబంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దొడ్డు, సన్నరకం వరి ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామని ఆయన అన్నారు. దసరా పండుగ వేళ రైళ్లను రద్దు చేయడం తగదని, ఈ విషయంపై రైల్వే జీఎంను కలుస్తానాని కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. రైళ్లరద్దుతో కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని జీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, సాదవరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కట్కూరి మధుసూదన్‌రెడ్డి, నాగిడి సంజీవరెడ్డి, తిరుపతిగౌడ్, అఖిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దేశాయిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో వేణుకుమార్, హెచ్ఎంలు, టీచర్లు

కబడ్డీ పోటీల్లో ప్రతిభ

చొప్పదండి: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీల్లో చొప్పదండి మండల జట్టు ప్రతిభ కనబరిచి అండర్– 14 విభాగంలో ప్రథమ, అండర్– 17 విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు ఎస్జీఎఫ్ మండల సెక్రటరీ కొమురోజు కృష్ణ తెలిపారు. బుధవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈవో వేణుకుమార్, హెచ్ఎం వైద్యుల రాజిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. ట్రైనర్స్ కృష్ణ, రాజ్ కుమార్, స్నేహలత, విక్రమ్, భవాని, మౌనికను అభినందించారు.

నివారణ చర్యలు చేపట్టాలి

గంగాధర: పంటపొలాల్లో తెగులు నివారణ చర్యలు చేపట్టి పంట నష్టం వాటిల్లకుండా చూసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని నారాయణపూర్, కురిక్యాల, గట్టుభూత్కూర్ గ్రామాల్లో బుధవారం వరిపంటను వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డితో పాటు వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. వరిలో ఎండు తెగులు, దోమపోటు, కంకినల్లి, పాముపొడ తెగుళ్ల గుర్తించామని నివారణకు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు. క్షేత్ర సందర్శనలో వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రియదర్శిని, వ్యవసాయాధికారి శ్రీనివాస్, విస్తరణ అధికారులు గోపిచంద్, వెంకటస్వామి, వంశీధర్, రమ్య పాల్గొన్నారు.



వరిని పరిశీలిస్తున్న భాగ్యలక్ష్మి, అధికారులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



హుజూరాబాద్‌లో దీన్ దయాల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కృష్ణారెడ్డి, నాయకులు

మానకొండూర్/తిమ్మాపూర్/హుజూరాబాద్/జమ్మికుంట/ఇల్లందకుంట/చిగురుమామిడి: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నాయకులు అన్నారు. బుధవారం దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి సేవలను కొనియాడారు. పార్టీ సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికి అందుతున్నాయనేది ప్రజలే చెబుతున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలు బీజేపీనే ఆదరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మంత్రి, బీజేపీ సభ్యత్వ నమోదు మానకొండూర్ నియోజకవర్గ పర్యవేక్షకుడు ఇనుగాల పెద్దిరెడ్డి, మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్: రేణికుంటలో సభ్యత నమోదులో పాల్గొన్న ఇనుగాల పెద్దిరెడ్డి, నాయకులు